



అతివకు ఉచితం!

- ఆగస్టు 15 నుంచి ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం
- బస్సుల సంఖ్య పెంపుపై ప్రభుత్వానికి నివేదిక
- జిల్లాలో రోజువారీ ప్రయాణికుల సంఖ్య 1,80,939
- అందులో మహిళలు 71 వేలు, మొత్తం బస్సులు 469

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ఆగస్టు 15 నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. ఆర్టీసీ డిపోల వారీగా రోజూ ప్రయాణించే మహిళల సంఖ్యను అంచనా వేస్తున్నారు. జిల్లాలో సుమారు 71 వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్లు సదరు అధికారులు అంచనా వేశారు. ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఈ సంఖ్య 10 నుంచి 20 శాతం వరకు పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ మేరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలను రూపొందించారు. జిల్లాలో బస్సుల అవసరాలను ప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు ఇప్పటికే నివేదికిచ్చారు.

పల్నాడు జిల్లాలో ఆర్టీసీ ముఖచిత్రం

జిల్లాలో ఆరు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల డిపోల ద్వారా ఆర్టీసీ బస్సులను నిర్వహిస్తోంది. పల్లె వెలుగు సర్వీసుల్లోనే అతివలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 469 బస్సులు ఉన్నాయి. వీటిలో రోజు 439 బస్సులను వివిధ రూట్లల్లో నిర్వహిస్తున్నారు. నరసరావుపేట - గుంటూరు, నరసరావుపేట - వినుకొండల మధ్యే ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఆర్టీసీ నిర్వహిస్తోంది. జిల్లా కేంద్రం నరసరావుపేట నుంచి సత్తెనపల్లి, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల రూట్లల్లో మొత్తంగా పల్లె వెలుగు సర్వీసులే ఉన్నాయి. వినుకొండ రూట్‌లో ఎక్స్‌ప్రెస్‌లతో పాటు పల్లె వెలుగులు కూడా ఉన్నాయి. ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తే ఇతర రవాణా సౌకర్యాలను వినియోగిస్తున్న మహిళలు ఆర్టీసీలోనే ప్రయాణిస్తారని అంచనాగా ఉంది. ఈ నేపథ్యంలో పల్లె వెలుగు బస్సుల సంఖ్య పెంచాల్సి వస్తుందని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు బస్సుల్లో రద్దీ ఉంటుందని అంచానా వేస్తున్నారు. ఏ రూటులో మహిళల ప్రయాణం రోజూ అధికంగా ఉంటుందో కూడా గుర్తిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా.. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేయగా.. ఆర్టీసీలో ఉచిత ప్రయాణానికి సిద్ధమవుతుండటంపై మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

డ్రోన్లు డౌటే

సొమ్ము చెల్లించినా అందని వైనం

- 121 డ్రోన్లకు 48 మాత్రమే పంపిణీ
- చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ



వ్యవసాయంలో యాంత్రీకరణ గణనీయంగా పెరుగుతోంది. ఆధునిక సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన కూలి రేట్లు, కూలీల కొరతను అధిగమించేలా.. సాగుదారులకు ఊరట లభించేలా.. స్థానికంగా పలువురు ఉపాధి పొందేలా.. వ్యవసాయ యాంత్రీకరణ జరగాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన డ్రోన్లతో సాగు చేపట్టేలా రైతుల్లో అవగాహన పెంచుతోంది. ఆయా డ్రోన్లను సబ్సిడీపై అందిస్తోంది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో డ్రోన్లను సంఘాలకు అందజేయడంపై వ్యవసాయశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది.

జిల్లాల వారీగా డ్రోన్ల పంపిణీ ఇలా..

జిల్లా	లక్ష్యం	పంపిణీ
పల్నాడు	43	14
గుంటూరు	42	21
బాపట్ల	36	13

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ పద్ధతులను ఆధునీకరించడం.. ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం యాంత్రీకరణను వేగవంతం చేస్తోంది. పురుగు మందులు పిచి కారితో పాటు ఎరువులు చల్లేందుకు డ్రోన్లు అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు అటు ఖర్చులు, ఇటు కూలీల బాధలు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంతోకాలంగా స్థోమత ఉన్న రైతులు పలువురు డ్రోన్లను వినియోగిస్తూ సాగులో లబ్ధి పొందుతున్నారు. అయితే అందరూ వ్యక్తిగతంగా డ్రోన్లను సమకూర్చుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో సబ్సిడీపై అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్లు వినియోగంపై ఆయా గ్రామాల్లోని రైతు సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చి తద్వారా కొందరికి ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంది. ఎరువులు, పురుగు మందుల పిచికారిలో డ్రోన్లను విరివిగా వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే 121 డ్రోన్లను

(మిగతా 6లో)

ఐదు లారీలకు రూ.12 లక్షలు

మరో 14 గ్రానైట్ లారీల లెక్కతేల్చని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రానైట్ అక్రమ రవాణాపై వాణిజ్య పనులు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న గ్రానైట్ లారీలపై దాడి చేసి తనిఖీలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఇటీవల పల్నాడు జిల్లా పరిధిలో 19 లారీలను అధికారులు సీజ్ చేశారు. వీటిలో ఐదు లారీల నుంచి గ్రానైట్ విలువ ఆధారంగా సుమారు రూ.12 లక్షలు జరిమానా వసూలు చేశారు. 14 లారీలకు సంబంధించి ఇంకా వసూలు కాలేదని అధికారులు తెలిపారు. ఆయా లారీలకు సంబంధించి గ్రానైట్ సంస్థలకు నోటీసులు జారీ చేశారు. లారీలో ఎంత విలువైన గ్రానైట్ ఉందో అంతే మొత్తంలో పన్ను చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గ్రానైట్ విలువపై 18 శాతం పన్ను చెల్లిస్తామని రాజకీయ నేతలతో అధికారులపై అక్రమార్కులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే గ్రానైట్ విలువ ఆధారంగా పన్ను చెల్లించాల్సిందేనని అధికారులు తేల్చి చెబుతున్నారు. లేకుంటే స్వాధీనం చేసుకున్న గ్రానైట్‌ను వేలం ద్వారా విక్రయిస్తామంటున్నారు.



అరచేతిలో పుర సేవలు!
● సేవా మిత్ర మాదిరి.. పుర మిత్ర మొబైల్ యాప్ ● మొత్తం 150 రకాల సేవలు ● సచివాలయ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ 8

తిలాపాపం తలా ఎంత..?
● రూ.40 కోట్ల భూ అక్రమ రిజిస్ట్రేషన్‌పై పునర్విచారణ ● రంగంలోకి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ ● జిల్లా రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో నేటి నుంచి విచారణ

'తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా' చేయూత
● 110 ప్రభుత్వ పాఠశాలలకు రూ. 6 లక్షల లబ్ధి 6

పీ-4కు చేయూత ఇవ్వాలి

సంపన్నులకు కలెక్టర్ అరుణ్‌బాబు సూచన



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్డీవో మధులత, కమిషనర్ జస్వంత్, తహసీల్దార్ వేణు

నరసరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం కోసం ప్రభుత్వం అమలు చేస్తోన్న పీ-4 కార్యక్రమానికి సంపన్నులు చేయూత ఇవ్వాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. నరసరావుపేట మున్సిపాల్టీలోని 15, 17 వార్డులకు సంబంధించి గురువారం జరిగిన వార్డు సభల్లో ఆయన మాట్లాడారు. పీ-4 పథకానికి జిల్లాలో 63 వేల కుటుంబాలు నమోదు చేసుకున్నారు. కాగా నరసరావుపేటలో 4000 మందికి మార్గదర్శులు 100 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. జిల్లాలో ఎందరో సంపన్నులు ఉన్నారని, విదేశాల్లో కూడా పలువురు ఉన్నారని వీరందరూ ఆర్థిక సాయం అందజేస్తే ఆయా కుటుంబాలు పేదరికం నుంచి బయటకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆర్డీవో మధులత, కమిషనర్ జస్వంతరావు, తహసీల్దార్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ చేపట్టాలి

డీటీలకు జేసీ సూరజ్ ధనుంజయ్ ఆదేశాలు



నరసరావుపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ పంపిణీ, దీపం సిలిండర్ల సరఫరాకు సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై విచారణ చేపట్టాలని డీటీలను జేసీ సూరజ్‌ధనుంజయ్ ఆదేశించారు. రేషన్, దీపం సిలిండర్ల పంపిణీపై గురువారం కలెక్టరేట్‌లో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు సరిగా రేషన్ పంపిణీ చేయడంలేదని, దురుసుగా వ్యవహరిస్తున్నారని కార్డుదారులు ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఫిర్యాదు చేశారన్నారు. సిలిండర్ల సరఫరాలో డెలివరీ సిబ్బంది రసీదులో ఉన్న మొత్తం కన్నా ఎక్కువగా నగదు వసూలు చేస్తున్నారని దీపం - 2 లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. డీటీలు రేషన్ షాపులను తనిఖీ చేసి కార్డుదారులను విచారించి నివేదిక అందజేయాలని జేసీ ఆదేశించారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ వసూళ్లను కట్టడి చేయాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, బీ-ఫారం లైసెన్స్‌ను రద్దు చేస్తామని గ్యాస్ డీలర్లను జేసీ హెచ్చరించారు. సమావేశంలో డీఎస్‌వో ఏంవీ ప్రసాదు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

నకరికల్లు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి సాగుకు సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు తెలిపారు. గురువారం నకరికల్లు మండలం నరసింగపాడులో బోరు బావుల ద్వారా వరి సాగు చేస్తున్న రైతులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో 39,079 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. బీపీటీ 5204, జేజీఎల్ 384, కేఎన్ఎం 1638, అంకుర్ పద్మ, అన్నపూర్ణ, అంకుర్ సోనం, హెచ్ఎంటీ సోనం వంటి రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వరిలో ఎకరాకు వంద నుంచి రెండు వందల కిలోల వర్మి కంపోస్టు వాడకంతో దిగుబడుల నాణ్యత పెరుగుతుందని రైతులకు తెలిపారు. అనంతరం వర్మి కంపోస్టు ఎరువుల కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో దేవదాసు, పీఎస్ అప్పారావు, ఏఈవో దిలీప్‌కుమార్, ముస్తక్ తదితరులు పాల్గొన్నారు.



నరసింగపాడులో వరి నారుమడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

మధ్యాహ్న భోజనంలో.. నాణ్యత ఉండాలి

● ఊటుకూరు జడ్పీ హైస్కూల్‌లో డీఈవో తనిఖీలు

క్రోసూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని డీఈవో చంద్రకళ తెలిపారు. మండలంలోని ఊటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆమె మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా.. లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నదని, ఈ విషయంలో ఉపాధ్యాయులు కూడా సహకరించాలన్నారు.

శుభకార్యానికి వెళ్తుండగా.. ప్రమాదం

● అదుపు తప్పి పల్టీ కొట్టిన కారు
● ఐదుగురికి తీవ్రగాయాలు
● జీఎంసీ ఉద్యోగి భార్య, ద్విచక్ర వాహనదారుడి పరిస్థితి విషమం



చెక్కవాగు వద్ద పల్టీ కొట్టిన కారు



ఆటోలో క్షతగాత్రులు లక్ష్మి, మల్లికార్జున్, సంఘవిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు

వినుకొండటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కారు అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లి సమీపంలో వినుకొండ - కర్నూలు జాతీయ రహదారిపై గల చెక్కవాగు వద్ద గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న నల్గొండ జయరామ్ కుటుంబ సమేతంగా ప్రకాశం జిల్లా గజ్జలకొండలోని బంధువుల శుభకార్యానికి హాజరయ్యేందుకు ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి చెక్క వాగు బ్రిడ్జిపై గోడలకు ఢీకొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టింది. ఈ నేపథ్యంలో వినుకొండ నుంచి విఠంరాజుపల్లి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం కారును ఢీకొనడంతో వాహనదారుడు తలతోటి మల్లికార్జున్‌కు, అలాగే కారులో ఉన్న జయరామ్ భార్య లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఘటనా స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినప్పటికీ ..అందుబాటులోకి రాకపోవడంతో.. ఆటో సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఇదే ప్రమాదంలో జయరామ్, అతని కుమార్తెలు సంఘవి, జాహ్నవిలకు కూడా గాయాలయ్యాయి. వీరిని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. ప్రమాదం సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. గాయపడిన లక్ష్మి, ద్విచక్ర వాహనదారుడు మల్లికార్జున్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అందుబాటులో లేని 108 అంబులెన్స్

ప్రమాదం నేపథ్యంలో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించినప్పటికీ కనీసం స్పందించిన దాఖలాలు లేవు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో జనం పెద్ద సంఖ్యలో గుమికూడటంతో జయరామ్ పెద్దకుమార్తె సంఘవి మెడలోని విలువైన బంగారు ఆభరణాలను దొంగలు దోచుకున్నట్లు సంఘవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షమీర్‌బాషా తెలిపారు.

పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాదు, లక్ష్మణరెడ్డి తదితరులు

గుంటూరు(తూర్పు), జూలై 24(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు విజ్ఞప్తి చేశారు. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా నగరంపాలెంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ జాషువా అపారమైన జ్ఞానంతో కుల ఆధారిత వివక్ష కారణంతో ఎదుర్కొన్న పోరాటాల నుంచి కవిత్వాన్ని రచించారన్నారు. తన కుమార్తె హేమలతను నాస్తిక ఉద్యమ నేత గోరా కుమారులు లవణంకు ఇచ్చి వివాహం చేశారని గుర్తుచేశారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. తన జీవితాంతం అసమానతలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు గుర్రం జాషువా అని కొనియాడారు. కావలి బాలస్వామి, అత్తోట జోసెఫ్ కుమార్, కాకుమాను పున్నారావు, ఏపీపీ సుకుమార్, కుక్కమూడి భగవాన్‌దాస్ పాల్గొన్నారు. అలాగే నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్లాలని జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు అన్నారు. బ్రాడిపేటలోని గుఱ్ఱం జాషువా విజ్ఞాన కేంద్రంలో జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఈమని అప్పారావు, కాకుమాను నాగేశ్వరరావు, బైరగాని శ్రీనివాసరావు, వై.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

'తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా' చేయూత

● 110 ప్రభుత్వ పాఠశాలలకు రూ. 6 లక్షల లబ్ధి



ప్లేట్లు, నోట్ పుస్తకాలు హెడ్మాస్టర్లకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా సభ్యులు భారీగా సహాయం అందించారు. 110 పాఠశాలలకు చెందిన 4,800 మంది విద్యార్థులకు రూ.3.63 లక్షల విలువ చేసే భోజన ప్లేట్లు, రూ. 2.50 లక్షల విలువ చేసే నోట్ పుస్తకాలు గురువారం స్థానిక ఎంఈవో ఎ.శ్రీనివాసరావు ద్వారా ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లకు అందజేశారు. కోమటినేనివారిపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఘంటసాల కరిముల్లా అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న సొసైటీ బాధ్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి ఈ సహాయం అన్ని పాఠశాలలకు అందేలా చూశారు.

కండక్టర్ ఇంటిలో బంగారు ఆభరణాల చోరీ



ఇంటి పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్ఐ

వినుకొండ టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): తాళాలు వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి సుమారు రూ.5లక్షల విలువ చేసే బంగారాన్ని దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ షమీర్ బాషా తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో నివాసం ఉంటున్న ఆర్టీసీ కండక్టర్ కన్నెగంటి విజయలక్ష్మి ఈ నెల 17న బంధువులతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు. గురువారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ షమీర్ బాషా ఘటనా ప్రాంతానికి చేరుకొని ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రోన్లు డౌటే

(5వ పేజీ తరువాయి)

పంపిణీ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ లక్ష్యం ఘనంగా ఉన్న ఆచరణలో సాధ్యం కావడం లేదు. నిర్ణయించిన వాటా ధనం చెల్లించి నెలలు గడుస్తున్నా సంఘాలకు డ్రోన్ల సరఫరా చేయలేదు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. రైతు సంఘాలు 89 డ్రోన్లకు వాటా ధనం కూడా చెల్లించాయి. అయితే ఇప్పటికి 48 డ్రోన్లను మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుతం సాగు పనులు విరివిరిగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో డ్రోన్లు పంపిణీపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో డ్రోన్లు అందుబాటులోకి వస్తాయన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లుతోంది. డ్రోన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నా చర్యలు లేవు. డ్రోన్లు కోసం వాటా ధనం చెల్లించిన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సీజన్ పూర్తయ్యాక డ్రోన్లు ఇచ్చి ప్రయోజనం ఉండదంటున్నారు.



● కృష్ణమ్మ పరవళ్లు

అమరావతి, జులై 24(ఆంధ్రజ్యోతి): ఎగువ వరద నీటితో కృష్ణానది నిండుదనం సంతరించుకుంది. కొన్ని నెలలుగా నీరు లేక ఎండుముఖంగా పట్టిన నది. అమరేశ్వరం ఆలయం వద్ద ఇలా పరవళ్ల తొక్కుతోంది. నదీ తీరం వెంబడి వాగుల వరద నీరు, కృష్ణా జిల్లా మునేరు ప్రవాహంతో ఉధృతి పెరిగే అవకాశం ఉంది.

రేపటి నుంచి జోయాలుక్కాస్ షోరూంలో..

బ్రిలియెన్స్ డైమండ్ జ్యూయలరీ షో

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని జోయాలుక్కాస్ షోరూంలో ఈ నెల 26వ తేదీ నుంచి బ్రిలియన్స్ డైమండ్ జ్యూయలరీ షో ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ జాయ్ అలూక్కాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహసవంతమైన బ్రైడల్ రూపకల్పనల నుంచి తప్పనిసరిగా ఉండాల్సిన సమకాలీన ఆభరణాల వరకు, షోలో ఉన్న ప్రతి ఆభరణం ఏదైనా ఒక ప్రత్యేకమైనది అందించటానికి రూపొందించబడిందన్నారు. ఈ పరిమితి ఎడిషన్ డిజైన్‌లు కేవలం ఎగ్జిబిషన్ ఉన్న సమయంలోనే లభిస్తాయన్నారు. ఆధునికత, స్టైల్‌ని సూచించే కలెక్షన్ ను సృష్టించటంతో పాటు అందం, భావోద్వేగం, వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తుందన్నారు. ప్రదర్శనలో రూ. లక్ష విలువ చేసే ప్రతి డైమండ్ జ్యూయలరీ కొనుగోలుతో ఉచితంగా ఒక గ్రాము గోల్డ్ కాయిన్‌ను అందించనున్నట్లు తెలిపారు. 26వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు మాత్రమే ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశం కోల్పోవద్దని పేర్కొన్నారు.

ఏటా విత్తన బంతుల పండుగ

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అంకారావు



విత్తన బంతులు చల్లుతున్న సలహాదారు అంకారావు

కారంపూడి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లుల సమయం మొదలుకొని సెప్టెంబరు చివరి వరకు నాలుగు నెలల పాటు ఏటఆ విత్తన బంతుల పండుగ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (వనాల అభివృద్ధి, అడవుల పెంపకం) పర్యావరణ వేత్త కొమెర అంకారావు పేర్కొన్నారు. గురువారం వినుకొండ రోడ్డులోని మంత్రాలమ్మ కనుమ ప్రాంతంలో ఆయన విత్తన బంతులు చల్లారు. ఈ సందర్భంగా అంకారావు మాట్లాడుతూ మేలో రకరకాల విత్తనాలు సేకరించి జూన్ మొదటి వారంలో విత్తన బంతులు తయారు చేసి అడవులు, ఎత్తయిన కొండలు, గుట్టలు, కుంటలు, మైదాన ప్రాంతాలు, ఊరు చివరి ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా.. మడ అడవుల అభివృద్ధి కోసం తీరప్రాంతాల్లో ఈ విత్తన బంతులు చల్లాల్సి ఉంటుందన్నారు. కోతులు, పక్షులు, వన్యప్రాణుల ఆహారం కోసం పండ్లు, దుంపలు, తీగ జాతి విత్తనాలు సేకరించి విత్తన బంతులు తయారు చేసి చల్లాలని సూచించారు. ప్రతి సంవత్సరం కోటి విత్తనాలు, విత్తన బంతుల పేరుతో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ సంవత్సరం ప్రారంభించామన్నారు. ఒకప్పుడు అడవులలో అరుదైన ఆకుకూరలు, ఔషధ వృక్షాలు ఉండేవని, అవి నేడు బెట్టకు గురై అంతరించిపోతున్నాయన్నారు. మరలా వాటిని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అరుదైన విత్తనాలు సేకరణ నిర్వహిస్తున్నామన్నారు. భూమికి విత్తనాన్ని లేదా మొక్కలు ఇవ్వడం లేది ఒక సంప్రదాయమన్నారు. విత్తనాల పండుగ అనేది ప్రతి సంవత్సరం ఒక అనవాయితీగా జరగాలన్నారు. వనాలు వృద్ధి అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములమై అడవుల శాతం పెంచుదామని అంకారావు పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



యశోద కుమారి (ఫైల్)

కారుమంచి(శావల్యాపురం)జూలై24(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిలో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలో ఈ నెల 21న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే కుటుంబానికి చెందిన మరో మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచింది. వివరాల్లోకి వెళితే.. శావల్యాపురం మండలం కారుమంచి బీసీ కాలనీకి చెందిన అన్నదమ్ములు ఒత్తుల శ్రీనివాసరావు, వెంకట్రావుల మధ్య స్థల వివాదంలో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు గాయపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చికిత్స కోసం ఆటోలో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి వెళ్తూ.. మార్గమధ్యంలో కనమర్లపూడి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై నలుగురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్నారు. వారిలో శ్రీనివాసరావు కుమార్తె యశోద కుమారి(30) పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. గుంటూరులోని జీజీహెచ్‌లో మృతదేహానికి పోస్టుమర్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు. రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలో మరో మహిళను కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి. మృతురాలు యశోదకుమారి డిగ్రీ వరకు చదివి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటోంది.

చికిత్స పొందుతూ యువకుడు..

శావల్యాపురం,జూలై24(ఆంధ్రజ్యోతి): గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో గాయాలపాలై.. గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వినుకొండ పట్టణంలోని కుమ్మరిపాలేనికి చెందిన పలుకూరి సుబ్బయ్య(31) గురువారం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో సుబ్బయ్యకు రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సుబ్బయ్య చనిపోయాడు. గుంటూరులోని జీజీహెచ్‌లో మృతదేహానికి పోస్టుమర్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు శావల్యాపురం ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. మృతుడు సుబ్బయ్యకు బార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో గురువారం 16.05 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 600 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

టిక్కెట్ ప్రయాణంపై అవగాహన కల్పించాలి

● దక్షిణ మధ్యరైల్వే పీసీసీఎం రమేష్



డీఆర్ఎంతో కలిసి సమీక్షిస్తున్న పీసీసీఎం రమేష్

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రతి ఒక్కరూ టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణించేలా అవగాహన కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం) రమేష్ ఆదేశించారు. గురువారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌కు వచ్చిన ఆయన గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్‌తో కలిసి వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీసీసీఎం రమేష్ మాట్లాడుతూ ప్రజారవాణలో రైలు ప్రయాణం ఎంతో చవక అన్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు తగిన టిక్కెట్‌లు కొనుగోలు చేసి నిర్ణీత బోగీలలో ప్రయాణించాలన్నారు. టీటీఈలు డివిజన్ పరిధిలో టిక్కెట్ తనిఖీలు విస్తృతం చేయాలని సూచించారు. యూటీఎస్, రైల్ వన్ యాప్‌లను వినియోగించి అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొనేలా చూడాలన్నారు. అమృత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. గతిశక్తి ప్రాజెక్టులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. గూడ్స్ షెడ్డు అభివృద్ధి, ప్రయాణికులకు సౌకర్యాల పైనా ఆయన సమీక్ష చేశారు. సీసీఎం కే సాంబశివరావు, మరో సీసీఎం డి.సత్యన్నారాయణ, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు పాల్గొన్నారు.

45,884 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 44,733 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,884 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,071 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12500
273	---	----	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	---
4884	----	----	341	10000	13600
సూపర్ 10	----	---	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	---	బ్యాడిగి	10000	12500
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000



సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్

కొత్తపల్లిలో సుపరిపాలన తొలి అడుగు

అచ్చంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. వర్షంలో గొడుగులు వేసుకొని ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పైనే కాకుండా త్వరలో రానున్న కొత్త సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. నియోజకవర్గంలో రూ.వంద కోట్ల అభివృద్ధి పనులు చేశానని వివరించారు. ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, కూకట్లపల్లి అయ్యప్పరాజు, ఎనిగండ్ల కోటయ్య, గంధం కోటేశ్వరరావు, తిరువాయిపాటి ఆంజనేయులు, యడ్లపల్లి బుచ్చిబాబు, వీరాంజనేయులు తదితర నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తా

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామానికి మౌలిక వసతులతో పాటు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి, మరి కొంతమంది టీడీపీ నాయకులు గుంటూరు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ గ్రామానికి సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అర్హులందరికీ పింఛన్లు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నాగిరెడ్డిపాలెం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

బెల్లంకొండలో సుపరిపాలనలో తొలి అడుగు

బెల్లంకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో గురువారం టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ మెయిన్ బజారు, యాదవ బజారులో ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీఎస్‌కే రసూల్, సర్పంచ్ జ్యోతి సముద్రం, గ్రామ పార్టీ అధ్యక్షుడు మజీద్, సయ్యద్ జానీ, టి.నాగేశ్వరరావు, టి.మల్లికార్జునరావు, గురవయ్య, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ కాంద్రు కాశయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి తదితరులు ఇంటింటికి తిరిగి గత సంవత్సర కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, నలజాల కోటేశ్వరరావు, అనుమాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడు రమేష్ మృతి

పిడుగురాళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కొత్తపల్లి రమేష్ గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. రమేష్ మృతివార్త తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రమేష్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అనంతరం టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డిలు రమేష్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. వైద్యులు వున్నం నాగమల్లికార్జునరావు, చింతలపూడి అశోక్‌కుమార్, ఏజీపి కరణం కాశీవిశ్వనాథంతో పాటు పల్నాడు జిల్లా ఏపియుడబ్ల్యుజె నేతలు మురళీ, శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది పాత్రికేయులు రమేష్ మృతదేహానికి నివాళులర్పించారు.

ఆపదలో టీడీపీ వెన్నంటి వుంటుంది..

రెంటచింతల, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో టీడీపీ వెన్నంటి వుంటుందని యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంచికల్లు గ్రామానికి చెందిన కౌలు రైతు బొమ్మనబోయిన నరసింహారావు పొలంలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన విషయం తెలుసుకుని మృతుని భార్య నాగలీల, కుటుంబీకులను ఓదార్చారు. మట్టి ఖర్చులకు రూ.20వేలు అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, యరపతినేని మట్టయ్య, శీలంనేని శివ, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన మైనర్‌లు

రెంటచింతల,జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలువాయిగేట్ గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలికలు ఈనెల 22న తప్పిపోగా గురువారం ప్రత్యక్షమైనట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. బొల్లాపల్లి మండలం మర్రివేముల గ్రామంలో వున్నట్లు ప్రత్యేక బృందం గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. తల్లి ఆదిపూడి రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అందుబాటులో ఎరువులు

● ఏఓ సంధ్యారాణి

పిడుగురాళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లలో పీఏసీఎస్, మార్కెటింగ్ సొసైటీల ద్వారా ఎరువుల నిల్వలు రైతులకు సరిపడ వున్నాయని ఏఓ సంధ్యారాణి తెలిపారు. గురువారం పిడుగురాళ్ల మార్కెట్ యార్డులోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. నానో డీఏపీ, యూరియాను అన్ని పంటలపై ఉపయోగించవచ్చని ఏఓ తెలిపారు.



ఎరువుల గోడౌన్‌లో స్టాక్ నిల్వలను తనిఖీ చేస్తున్న ఏఓ సంధ్యారాణి



సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని..

అభివృద్ధి ఘనత టీడీపీదే

● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత టీడీపీదేనని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని 6, 7 వార్డులలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.మూడున్నర కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటితో పలు వార్డుల్లో సిమెంట్ రోడ్లను వేయనున్నామని గుర్తుచేశారు. ప్రభుత్వ పథకాలు ప్రతిఒక్కరికి అందజేస్తామని పార్టీ పరంగా కష్టపడి పనిచేసిన కుటుంబాలకు ఉపాధి చూపుతానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, బిజిలి వెంకటరావు, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పణితి రవి, తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కన్నా, కూటమి నేతలు

గుర్రం జాషువాకు ఘన నివాళులు

సత్తెనపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): నవయువ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతిని గురువారం రైల్వే స్టేషన్ రోడ్డులో ఆయన విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, బలిజేపల్లి సురేష్‌కుమార్, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, శనగపూల నరసింహారావు, చిలకా శ్యామ్, పూజల వెంకట కోటయ్య, పురుషోత్తం నాయక్, పోట్ల అంజనేయులు, కంభాల వెంకటేశ్వరరావు, నూర్ బాషా జాన్ బాబు, దరువూరి నాగేశ్వరరావు, రాంబో బుడే, సయ్యద్ మాబూ పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సుధీర్ భార్గవ్‌రెడ్డి, మాదిగ ఉద్యోగులు కూడా జాషువా విగ్రహానికి నివాళులర్పించారు.

గుర్రం జాషువాకి ఘన నివాళులు

మాచర్లటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో గురువారం పద్మ విభూషన్ గుర్రం జాషువా 54వ వర్ధంతిని దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన భీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి, కడియం అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): దళితుల చైతన్యం గుర్రం జాషువా అని టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. గురువారం జాషువా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎనిగండ్ల కోటయ్య, టి.అంజనేయులు, బత్తుల శ్రీనివాసరావు, టి.కృష్ణమ్మ, శిఖా నరసింహారావు, దుద్దుల విజయ్, మేకల హనుమయ్య, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, రాయిడి సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యుడు కిరణ్ కుమార్

బాల్య వివాహాలను అరికట్టాలి..

బెల్లంకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రాజుపాలెం జడ్పీ పాఠశాలలో 9, 10 తరగతుల బాలబాలికలకు బాల్య వివాహాలను అరికట్టడం గురించి అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయనని, బాల్య వివాహాలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు పండించాలి

క్రోసూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులు పండించేందుకు కృషి చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎం శివకుమారి, క్రోసూరు ఏడీఏ పీ మస్తానమ్మ అన్నారు. శుక్రవారం క్రోసూరు రైతు సేవా కేంద్రంలో వివిధ పంటల్లో మేలైన సాగు పద్ధతులు, సస్య రక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో వీ వేణుగోపాల్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై పురుగు మందులు అందజేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 16.05 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా 400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

అచ్చంపేట పీఏసీఎస్‌లో రైతు శిక్షణ

అచ్చంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని పీఏసీఎస్ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. జిల్లా వనరుల కేంద్రం ఏవో అరుణ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించు కోవటానికి జీవన ఎరువులు ఎక్కువ వాడాలన్నారు. అనంతరం ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి లింగయ్య మాట్లాడుతూ మిరప పంటకు ఎకరాకు రూ 360 ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు ఈ అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కన్నా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇంటింటికి వెళ్ళి కార్యకర్తలు, నాయకులతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకొని వాటిని పై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ముందుగా రూ.16.40 లక్షలతో ఆధునీకరించిన వాకింగ్ ట్రాక్‌ను ఆయన ప్రారంభించారు. 3వ వార్డులో సీసీ రోడ్లు, అంతర్గత డ్రెయినేజ్‌లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సయ్యద్ పెద కరిముల్లా, నూర్ బాషా జాన్ బాబు, పురుషోత్తం నాయక్, శంకర్ నాయక్, రామకృష్ణా నాయక్, గుజ్జర్లపూడి స్టాలిని, అబ్దుల్ గౌస్, బత్తుల ఆదినారాయణ, కార్తీక్, కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూడాలి

● పీడీ లింగమూర్తి



కేసానుపల్లి ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న పీడీ లింగమూర్తి

దాచేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని పీడీ లింగమూర్తి అధికారులను కోరారు. గురువారం మండలంలోని కేసానుపల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య కాలనీ వాసులను ఇబ్బంది పెడుతోంది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీడీ లింగమూర్తి ఆధ్వర్యాన పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఇతర సాంకేతిక సిబ్బంది, గ్రామ పెద్దలు నెల్లూరి రామకోటయ్య తదితరులు ఎస్సీ కాలనీలో పర్యటించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య లేకుండా చూసేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి కాలనీలో సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వామినాయక్, సర్పంచ్ శెట్టిపోగు ఏసుదానం తదితరులు పాల్గొన్నారు.

బుగ్గవాగు రిజర్వాయర్ నూతన గేట్ల ఏర్పాటు ముమ్మరం

రెంటచింతల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గవాగు రిజర్వాయర్ నూతన గేట్లు ఏర్పాటు చేసే పనులు చివరిదశకు చేరాయి. జూలై ఆఖరు కల్లా 3,6 తుప్పపటిన గేట్ల స్థానంలో నూతన గేట్లను ఏర్పాటు చేస్తున్నారు. 3300 ఎకరాల విస్తీర్ణంలో వున్న రిజర్వాయర్ ద్వారా నాలుగు జిల్లాల్లోని 11 లక్షల 17 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది.



బుగ్గవాగు రిజర్వాయర్‌కు నూతన గేట్లు అమర్చుతున్న దృశ్యం

పీఏసీఎస్ ద్వారా రైతులకు సత్వర సేవలు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునగోడు పీఏసీఎస్ పరిధిలోని 9గ్రామాల రైతులకు సంఘం ద్వారా సత్వరసేవలు అందిస్తామని సంఘ చైర్‌పర్సన్ నాగోతు నాగార్జున అన్నారు. గురువారం తురగవారిపాలెంలోని మునగోడు పీఏసీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాటాడారు. రైతుల సౌకర్యార్థం పంటలపై మందుల పిచికారీకి డ్రోన్ అందుబాటులో ఉందన్నారు. పంటల సాగుకు ఎరువులను సిద్ధంగా ఉన్నాయన్నారు. లాభాలను రైతులకు డివిడెండ్ రూపంలో వారి ఖాతాలలో జమచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ బీ సాంబశివరావు, సంఘ పర్సన్ షేక్ ఖాసీం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ నాగార్జున

నేడు మంత్రి జనార్ధనరెడ్డి పర్యటన

మాచర్లటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి శుక్రవారం మాచర్ల నియోజకవర్గంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముందుగా కారంపూడిలోని ఎస్సీ కాలనీలో మాల కమ్యూనిటి హాల్‌కు శంకుస్థాపన చేసి అదే కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం ఒప్పిచర్లలో బీసీ వడియరాజుల కమ్యూనిటీ హాల్, ముస్లిం కమ్యూనిటి హాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారన్నారు. మాచర్లలోని సొసైటీ కాలనీలో సీసీ రోడ్డును ప్రారంభించి అనంతరం అదే కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారన్నారు. వెల్దుర్తి మండలం రచ్చమలపాడు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు.

కారంపూడి పర్యటనను విజయవంతం చేయండి

కారంపూడిలో శుక్రవారం జరగనున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి వంగలూరి పుల్లయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్ కోరారు.

గుంతలు పడ్డా పట్టించుకోరా..





పిడుగురాళ్లలోని ఎర్రవాగు వంతెనపై ఏర్పడిన గుంతలు

పిడుగురాళ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ఎర్రవాగు బ్రిడ్జిపై ఏర్పడిన గోతులతో ద్విచక్ర వాహనాలకే కాకుండా భారీ వాహనాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం పడిన వేళ గోతుల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు. బ్రిడ్జిపై ఏర్పడిన గోతులలో ఇనుపచువ్వలు బయటకు చొచ్చుకు రావడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ఆర్‌అండ్‌బి శాఖకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

సంక్షిప్తం...

● దాచేపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): పంటపొలాల్లో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం దాచేపల్లి మండలంలోని పొందుగుల కృష్ణానది వద్ద పంట పొలాల్లో పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. వారి వద్ద రూ.72వేల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● దాచేపలి: ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రగాయాలై వైద్య సేవలు పొందుతున్న దాచేపల్లి నగర పంచాయతీ ఇందిరానగర్ కాలనీ వద్ద మచ్చు పేతురు(58) బుధవారం రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు, బంధువులు పేతురును పిడుగురాళ్ళ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

● దాచేపల్లి: సీపీఐ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని గురజాల నియోజక వర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి కోరారు. గురువారం నారాయణపురంలోని సీపీఐ కార్యాలయంలో ఆగస్టు 7, 8 తేదీల్లో వినుకొండలో జరగనున్న జిల్లా మహాసభలకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు హాజరు కావాలని కోరారు.

● పిడుగురాళ: స్థానిక జడ్పీ పాఠశాలలో ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య పెంపుదలకు కృషి చేయాలని హెచ్ఎం మల్లికార్జునరావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర కో-ఆర్డినేటర్ పి రవీంద్రనాథ్ తెలిపారు. గురువారం స్థానిక జడ్పీ పాఠశాలను సందర్శించి ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

● పిడుగురాళ: స్థానిక లెనిన్‌నగర్‌లోని కార్ఫ్ పాఠశాలలో గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని కార్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్, హెచ్‌ఎం లత, దయామణి, సురేష్ చంద్ నివాళులర్పించారు.

● పిడుగురాళ్ళ: మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరారు. గత 10 రోజులుగా పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాల పెంపుతో వారు సమ్మెను విరమించి గురువారం విధుల్లో చేరారు. అనంతరం ఆయా వార్డుల పరిధిలో కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగింపులో పాల్గొన్నారు.

● మాచవరం: మాచవరం పెట్రోల్ బంకులో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పెట్రోల్‌కు బదులు నీరు కొట్టారంటూ పత్రికల్లో వార్తలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయ్ అధికారి, తూనికలు, కొలతలు అధికారులు పెట్రోల్ బంకులను గతంలో తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ పీ శివాజీ, ఏవో సీహెచ్ ఆదినారాయణ, తూనికలు, కొలతల అధికారులు షేక్ సైదా, ఏఎస్‌ఐ చెంచయ్య, స్థానిక డీటీ స్రవంతి పెట్రోల్ బంకులో తనిఖీలు చేశారు.

● సత్తెనపలి: సత్తెనపల్లి పట్టణ, మండలంలోని మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎస్సీఈఆర్‌టీ ద్వారా తయారు చేయించిన టీచర్ హ్యాండ్‌బుక్‌లను గురువారం ఎంఈవోలు శ్రీనివాసరావు, రాఘవేంద్రరరావులు మండల విద్యా వనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు.

● సత్తెనపలి: రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఈనెల 25వ తేదీ పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు మస్తాన్‌వలి, జా న్‌బాబు గురువారం టీడీపీ ప్రజావేదికలో విలేకరుల సమావేశంలో తెలిపారు.

● సత్తెనపల్లి రూరల్: 10 పరీక్షల్లో ప్రతిభచూపిన కొసన దేవీశ్రీ సాహితీకి సత్తెనపల్లికి చెందిన దాత తేళ్ళ వెంకటేశ్వరరావు గురువారం పట్టణంలోని సరస్వతి శిశు మందిరం ఉన్నత పాఠశాలలో రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ధనేకుల సాంబశివరావు, రమేష్ పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ: మండలంలో గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం పడటంతో పాటు సాగుకు కాల్వలకు ప్రభుత్వం నీటిని విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు తమ పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు.

● నకరికల్లు: ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు.

● మాచర్లటౌన్: మండలంలోని గుండ్లపాడులో మోడల్ స్కూల్‌ను గురువారం ఎంఈవో ఎండీ ఖాసీం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్ పట్టణంలో వీధి కుక్కుడ బెడద అధికంగా ఉందని, వాటిని నివారించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జింకల నాగేశ్వరరావు యాదవ్ కోరారు.

● రెంటచింతల: ఆషాడ అమావాస్య రోజు సందర్భంగా రెంటచింతలలోని శ్రీచౌడేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు గురువారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● గురజాలటౌన్: మండంలంలోని గంగవరంలో శుక్రవారం శ్రీచౌడేశ్వరి అమ్మవారి జన్మదినం వైభవంగా నిర్వహించారు. తొగటవీర క్షత్రియులు, గ్రామస్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమపూజ చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు.

● దుర్గి: దుర్గిలో ఉన్న శ్రీగంగా భ్రమరాంబ సమేత నగరేశ్వర నాగేశ్వర ఓంకారేశ్వర స్వామి ఆలయంలోని శ్రీవాసవీ అమ్మవారికి శుక్రవారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

● అమరావతి: సిబార్ దంతవైద్యశాల ఆధ్వర్యంలో అత్తలూరు ఆర్గానిక్ కేంద్రం సహకారంతో ఉచిత దంత వైద్యశిబిరం జరిగింది. ఈ వైద్యశిబిరంలో దంతాలు ఊడిపోయిన వృద్ధులు పదిమందికి కట్టుడు దంతాల సెట్‌ను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆర్గానిక్ కేంద్రం మేనేజర్ ఆదినారాయణ, ఎం వెంకటసుబ్రమణ్యం, ఎం.వెంకట్రావు, పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు: ఈనెల 25వ తేదీన మండలంలోని 75 తాళ్ళూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో 20వ ఆరాధన మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణ తెలిపారు.

● క్రోసూరు: మండలంలోని అనంతవరంలో ఈనెల 27వ తేదీన సహృదయఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మెగా వైద్య శిబిరం పోస్టర్లను గురువారం సినీ నటుడు సుమన్ గుంటూరులో ఆవిష్కరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ ప్రతినిధులు ఈడే మురళీకృష్ణ, శ్రీనివాసరావ కోరారు.

పురుగు మందుల దుకాణాలు తనిఖీ

మాచర్లటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుగుమందుల దుకాణాలను గురువారం మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకుడు వీ జగదీశ్వరరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు అనుమతులు పొందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులను ఇవ్వాలని సూచించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆహా.. అమరావతి!



వేగంగా నిర్మాణం జరుగుతున్న ఏపీ సెక్రటేరియట్ హెచ్ఓడీ భవన నిర్మాణం



తుది దశకు ప్రభుత్వ ఉద్యోగుల భవన సుముదాయం



శరవేగంగా ఈ6, ఎన్10 జంక్షన్ అండర్ డ్రెయినేజీ పనులు



ఏపీ సెక్రటేరియట్ హెచ్ఓడీ భవనాల గ్రౌండ్ వర్క్ పనులు





ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకున్నాయి. సెక్రటేరియట్ హెచ్ఓడీల భవనాల నిర్మాణం వేగంగా జరుగుతుండగా.. ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలు తుది దశకు చేరుకున్నాయి. సైడ్ డ్రెయిన్లు, గ్రీనరీ, పైపులైన్, ఎలక్ట్రికల్ పనులతో అంతా హడావిడిగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అమరావతి ఆహ్లాదకరంగా కనువిందు చేస్తోంది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



అరచేతిలో పుర సేవలు!

- సేవా మిత్ర మాదిరి.. పుర మిత్ర మొబైల్ యాప్
- మొత్తం 150 రకాల సేవలు
- సచివాలయ సిబ్బంది స్పెషల్ డ్రైవ్

ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో పలు రకాల సేవలను ప్రజల అర చేతిలోకి తెచ్చిన ప్రభుత్వం.. పురపాలక సేవలను కూడా పౌరుల చెంతకు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. పట్టణాలు, నగరాల్లో ఉండే ప్రజలకు పౌర సేవలను సులభతరం చేయడం కోసం సేవా మిత్ర మాదిరిగా 'పురమిత్ర' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దానిపై అవగాహన కల్పిస్తూ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తోంది.

గుంటూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో ఉండే ప్రజలు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తుంది. నగరాల్లో అయితే ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. మున్సిపాలిటీలకు పన్నులు కట్టాలన్నా, చార్జీలు చెల్లించాలన్నా, ఏదైనా సమస్యపై ఫిర్యాదులు చేయాలన్నా గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి ఉంటుంది. వార్డు సచివాలయాలు వచ్చిన తర్వాత వారంతా స్థానిక సచివాలయాల దగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు ఆపాటి ఇబ్బంది కూడా లేకుండా చేయడం కోసం రాష్ట్ర పురపాలక శాఖ 'పురమిత్ర' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా అనేక రకాల డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.

రోజుల వ్యవధిలోనే పరిష్కారం

రోజుల వ్యవధిలోనే సమస్యల పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. సమస్యను పంపేందుకు యాప్‌లో ఫీచర్స్ కూడా పొందుపరిచారు. మన చుట్టూ ఉన్న సమస్యను ఫొటో తీసి, వాయిస్ రికార్డుతో అక్షరాలను టైప్ చేసి పంపించే విధంగా యాప్‌ను రూపొందించారు. పంపిన సమస్య, ఆ సమాచారం నేరుగా సంబంధిత విభాగాధికారికి వెళ్తుంది. పరిష్కారం చూపేందుకు కనీసం మూడు నుంచి 15 రోజులు, లేదా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు. సమస్య తీవ్రత బట్టి పరిష్కారం చూపిస్తారు.

యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి?

ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ వాడేవారు గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి 'పురమిత్ర' అని టైప్ చేస్తే యాప్ ప్రత్యక్షమవుతుంది. దాన్ని మొబైల్‌లోకి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తరువాత ఓపెన్ బటన్ క్లిక్ చేసి యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. వాటి పరిధిలోని సచివాలయాన్ని ఎంచుకోవాలి. ఆ తరువాత పేరు మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఎంటర్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే యాప్‌లో సేవలకు సంబంధించిన ఆప్షన్లు కనిపిస్తాయి. పబ్లిక్ హెల్త్, మొదలు రెవెన్యూ సేవల వరకూ 8 విభాగాలు కనిపిస్తాయి. మన సమస్య ఏ విభాగానికి సంబంధించినదైతే ఆ విభాగాన్ని టచ్ చేస్తే అందులో పలు రకాల సేవలకు సంబంధించిన ఆప్షన్స్ కనిపిస్తాయి. వాటిని క్లిక్ చేసి మన సమస్యను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు.

యాప్ ద్వారా 150 సేవలు

పురమిత్ర యాప్ ద్వారా మొత్తం 150 సేవలు అందుబాటులోకి తెస్తున్నారు. రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు సంబంధించిన 150 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు.

- పన్ను చెల్లింపులు, కుళాయి చార్జీల చెల్లింపులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, వివాహ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునే సదుపాయం ఈ యాప్‌లో కల్పించారు.
- తమ ఆవాసాల వద్ద ప్రజలు ఎదుర్కొనే రోజువారీ సమస్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు కూడా చేయవచ్చు. తాగునీటి సరఫరా సమస్య, విద్యుత్ అంతరాయాలు, పారిశుధ్య నిర్వహణ, డ్రెయినేజీ సమస్య, రహదారుల సమస్యలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు కూడా చేసే సదుపాయం ఈ యాప్‌లో కల్పించారు.
- పారిశుధ్య నిర్వహణకు సంబంధించి దోమలు, వీధికుక్కల సమస్య, శ్మశాన వాటికల సమస్య, బయో, మెడికల్ వ్యర్థాల తొలగింపు, వీధులను శుభ్రం చేయకపోవడం, గుర్తు తెలియని మృతదేహాలు, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, రోడ్ సైడ్ ఆహార కల్తీ, గార్బేజ్ బిన్‌ల ఏర్పాటు, చెత్త తొలగింపు వంటి మొత్తం 53 రకాల సేవలు అందుబాటులో ఉంచారు.
- టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి పార్కింగ్ సమస్య, అనధికార ప్రకటనలు, బోర్డులు, హోర్డింగులు, ట్రీ గార్డుల సమస్య, అనధికార కట్టడాలు, కమ్యూనిటీ హాళ్ల దుర్వినియోగం, ప్రమాదకరంగా ఉన్న తీగల సమస్య, సెల్ టవర్ల సమస్య, మార్కెట్ సమస్యలు, ఫుట్‌పాత్‌ల నిర్వహణ, ఆక్రమణ వంటి 13 రకాల సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చు.
- వాటితోపాటుగా నీటి సరఫరాకు సంబంధించి 4, పట్టణ పేదరిక నిర్మూలనకు సంబంధించి 12 సేవలు, పాలనా పరమైన సేవలు, 6,ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 16, వీధి దీపాల సమస్యపై 3, రెవిన్యూ విభాగానికి సంబంధించి 12 సేవలు ఈ యాప్‌లో అందుబాటులోకి తెచ్చారు. వీటికి సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు ఇంట్లో నుంచే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రకాశం బ్యారేజీకి కొనసాగుతున్న వరద ఉధృతి

- దిగువకు 25 క్యూసెక్కులు ● డెల్టా కాల్వలకు 4,321 క్యూసెక్కులు విడుదల



తాడేపల్లి టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలలకు ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి గురువారం కొనసాగింది. ఎగువన ఉన్న ప్రధాన వాగులు వజినేపల్లి నుంచి 1018, వెలగలేరు నుంచి 2070, కీసర నుంచి 2193, పాలేరు నుంచి 2595 మొత్తం వరద నీరు 27,605 క్యూసెక్కులు బారేజి రిజర్వాయర్ వద్దకు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 35 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి దిగువకు 25,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా తూర్పు డెల్టా కాల్వలకు 3,305, పశ్చిమ డెల్టా కాల్వకు 1016 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రాజేష్ తెలిపారు.

సీఆర్డీఏ జాబ్ మేళా సద్వినియోగం

తుళ్లూరు, జులై 24(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(ఏపీ సీఆర్డీఏ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ సౌజన్యంతో తుళ్లూరు సీఆర్డీఏ స్కిల్ హబ్ ప్రాంగణంలో గురువారం జాబ్ మేళా జరిగింది. ఈ మేళాలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, ఎఫ్ ట్రానిక్స్ సిస్టం ప్రవేటు లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్, హవెల్స్ ఇండియా, కురాకు ఫైనాన్సియల్ సీర్వసెస్, ఫోర్డ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 400కి పైగా టెక్నికల్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళా నిర్వహించారు. మేళాలో 318 మంది అభ్యర్థులు హాజరు కాగా, 102 మందికి ఉద్యోగాలు లభించాయి. వీరిలో 30 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల హెచ్ఆర్‌ల ఆఫర్ లెటర్లు అప్పుడే అందుకున్నారు. ఈ క్యార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి అరుణ కుమారి, సీఆర్డీఏ డీసీడీఓ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. సీఆర్డీఏ సీనియర్ లైవ్‌లీ హుడ్ ఆఫీసర్ శంకరు, జూనియర్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్ట్ క్రాంతి కుమార్, నరసింహం, వెంకటేశ్వర్లు పాల్గొని జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించారు.

మిర్చి యార్డులో అక్రమాలపై..

మార్కెటింగ్ కమిషనర్‌కి ఫిర్యాదులు

- విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డీడీకి ఆదేశాలు

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డులో జరుగుతోన్న అక్రమాలపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఫిర్యాదుపై విచారణ జరుగుతుండగా.. మరో నలుగురు ఫిర్యాదులు పంపించారు. సీఎంని అడ్రస్ చేస్తూ మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయానికి రిజిష్టర్ పోస్టులో నాలుగు ఫిర్యాదులు అందాయి. దీంతో వాటిపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని మార్కెటింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ దివాకర్‌కు మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత ఆదేశాలు జారీ చేశారు. ఏక కాలంలో ఈ విచారణలు మిర్చి యార్డులో జరుగుతున్నాయి. ఎమ్మెల్యే మాధవి ఫిర్యాదుపై సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ చంద్రిక విచారణ జరపనుండగా.. నలుగురి ఫిర్యాదులపై ఆర్‌డీడీ దివాకర్ విచారణ చేస్తున్నారు. దీంతో మార్కెటింగ్ శాఖలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీ రాజ్‌లో..

ఎంప్లాయీస్ ఎన్నికల సందడి

- ఆగస్టు 5న జిల్లా పరిషత్ యూనిట్‌కు ఎలక్షన్
- 7 నుంచి ఉమ్మడి జిల్లాలోని యూనిట్లకు

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా అధ్యక్షుడు జొన్నల పూర్ణ చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూచిపూడి మోహన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఆగస్టు 5న సాయంత్రం 4 గంటలకు గుంటూరు జిల్లా పరిషత్ యూనిట్‌కు ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. తదుపరి ఉమ్మడి జిల్లాలోని యూనిట్‌లకు ఎన్నికల ప్రక్రియ ఆరంభం అవుతుందన్నారు. గుంటూరు రూరల్, ప్రత్తిపాడు యూనిట్‌లకు 7న, మంగళగిరి, తాడికొండ యూనిట్‌లకు 11న, పెదకూరపాడు, రాజుపాలెం, ఫిరంగిపురం యూనిట్‌లకు 12న ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా నరసరావుపేట డివిజన్ నాదెండ్ల, నరసరావుపేట యూనిట్‌లకు 7న, వినుకొండ, ఈపూరు యూనిట్లకు 11న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. గురజాల డివిజన్ పిడుగురాళ్ల, గురజాల, మాచర్ల యూనిట్‌లకు 12న ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. తెనాలి డివిజన్ దుగ్గిరాల, తెనాలి, అమర్తలూరు యూనిట్‌లకు ఆగస్టు 7న, పొన్నూరు, బాపట్ల యూనిట్‌లకు 11న, రేపల్లె, నగరం యూనిట్‌లకు 12న ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఎన్నికల అధికారులుగా పలువురు ఏఓలను నియమించినట్లు వెల్లడించారు.

ఏవో..ప్రమోషన్లు?

- అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ల ఎదురు చూపులు
- ఖాళీలు ఉన్నా.. కరుణ చూపని జడ్పీ అధికారులు
- సెక్షన్‌లలో చక్కర్లు కొడుతున్న ఫైల్

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రమోషన్‌ల కోసం ఉద్యోగులు తపస్సు చేయాల్సి వస్తోంది. ఖాళీలు ఉన్నా ఉద్యోగోన్నతి కల్పించే విషయంలో అధికారుల కరుణ కరువైనట్లు కనిపిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాలు, జిల్లా పరిషత్‌లో మొత్తం 67 మంది ఏఓ (అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్)లు ఉండాలి. వాటిలో ప్రస్తుతం సుమారు 9 వరకు ఖాళీలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్‌లతో ప్యానల్ రూపొందించి ఖాళీ అయిన స్థానాల్లో నియమించాలి. కొద్ది రోజులుగా అర్హత కలిగిన సీనియర్ అసిస్టెంట్లు పదోన్నతి ఫైల్‌కు మోక్షం కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. అయినా కూడా సంబంధిత ఫైల్ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది.

ఇవిగో ఖాళీలు

మండల పరిషత్‌లో ఎంపీడీఓ తర్వాత అత్యంత కీలకమైన పాత్ర పరిపాలన అధికారిదే. ప్రభుత్వం పరిపాలన అధికారులుగా వారికి కీలకమైన బాధ్యతలు అప్పగించింది. ప్రాధాన్యం కలిగిన పోస్టులు చాలా చోట్ల ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో బొల్లాపల్లి, గురజాల, శావల్యాపురం, పిట్టలవానిపాలెం, ప్రత్తిపాడు, ఈపూరు, నూజెండ్ల మండలాల్లో పూర్తిస్థాయి ఖాళీలున్నాయి. ఈ నెలాఖరుకు రాజుపాలెం, రొంపిచర్ల కూడా ఖాళీ అవుతాయి. ఆగస్టు 15 నాటికి మరో పోస్ట్ కూడా ఖాళీ అవుతుంది. ప్రస్తుతం ఖాళీ ఉన్న స్థానాల్లో సీనియర్ అసిస్టెంట్‌లను నియమిస్తే వారి కింద వారికి కూడా ప్రమోషన్‌లకు అవకాశం వస్తుంది. ఎన్నో సంవత్సరాల నుంచి అర్హత ఉండి ఇంకా జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా, రికార్డు అసిస్టెంట్‌లకు జూనియర్ అసిస్టెంట్‌లుగా, ఆఫీస్ సబార్డినేటర్లకు రికార్డు అసిస్టెంట్లుగా ప్రమోషన్ లభిస్తుంది. ఇలా ఒక ప్రమోషన్‌తో చాలా మంది వ్యవహారం ముడిపడినందున అధికారులు ఏఓల ఫైల్ కు మోక్షం కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నాలుగు నెలల క్రితం ఖాళీ అయిన స్థానాల్లో కనీసం ఈ నెలాఖరుకు అయినా ఉద్యోగోన్నతి నియామకాలు చేపడతారని సీనియర్ అసిస్టెంట్‌లు ఆశపడుతున్నారు.



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయం

తిలాపాపం తలా ఎంత?

- రూ.40 కోట్ల భూ అక్రమ రిజిస్ట్రేషన్‌పై పునర్విచారణ
- రంగంలోకి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ
- జిల్లా రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో నేటి నుంచి విచారణ
- నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఏసీబీ కన్ను..?

గుంటూరు సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సంచలనం సృష్టించిన రూ.40 కోట్ల భూమి నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపించాలని స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అసలు ఈ మొత్తం వ్యవహారంలో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్‌తో పాటు, మిగిలిన వారి పాత్ర ఎంత మేరకు ఉందన్న వ్యవహారంపై లోతైన పరిశీలన చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐ జీ నిర్ణయించినట్లు సమాచారం. తమ భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గతంలోనే బాధితుడు కొత్తపల్లి శ్రీనివాసరావు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీని కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణ జరిపించి కేసు నమోదు చేయించాలని అప్పటి జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా రిజిస్ట్రార్ మారడం, అప్పట్లో జరిగిన విచారణ సమగ్రంగా లేకపోవడంతో మళ్లీ పునర్విచారణ జరిపించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. శుక్రవారం నుంచి విచారణ ఆరంభమయ్యే అవకాశం ఉంది.

మాచర్ల ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పాత్ర..

గుంటూరుకు చెందిన కొత్తపల్లి పద్మజ భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో రోజుకొక పేరు తెరపైకి వస్తోంది. అప్పట్లో నరసరావుపేటలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం మాచర్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న వ్యక్తి మొదట ఆభూమికి 18 జీపీఏలు చేసినట్లు తేలింది. ఆ తర్వాత రోజు విధులకు హాజరైన నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఆ దస్తావేజులకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఆ దస్తావేజులకు గుంటూరులోని కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ అప్రూవల్ ఇచ్చారు. కొత్తపల్లి శ్రీనివాసరావు నల్లపాడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్, కొరిటపాడు సబ్ రిజిస్ట్రార్ పేర్లు ఉన్నాయి. వారిపై కేసు కూడా నమోదైంది. మాచర్ల ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పేరు కూడా కేసులో చేర్చాలని బాధితులు పోలీసులను కోరుతున్నట్లు తెలిసింది.

రాయబేరాలు..

మొత్తం రిజిస్ట్రేషన్ శాఖకే తలవంపులు తెచ్చిన మాజీ జాయింట్ రిజిస్ట్రార్‌ను కేసు నుంచి తప్పించేందుకు భారీ ప్రయత్నం జరుగుతుంది. అదే శాఖకు చెందిన కొందరు ఈ వ్యవహారంలో అసలు ఆయన తప్పు లేదని అంటున్నారు. ఆయన తప్పు లేకపోతే అసలు దోషులు ఎవరు అన్న దానిపై అక్కడ సమాధానం దొరకడం లేదు. ఈ వ్యవహారంలో అందరికీ శిక్ష పడాలని బాధితుడు శ్రీనివాసరావు అంటున్నారు. ఈ కేసు ఒక నమూనా కావాలని ఆయన పేర్కొన్నారు.

నరసరావుపేట రైటర్ పెట్టుబడి..

రూ.40 కోట్ల భూమికి నకిలీ రిజిస్ట్రేషన్ చేయించేందుకు నిందితులు భారీ మొత్తంలో ముడుపులు ముట్టజెప్పారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరికి రూ.10 లక్షలు తగ్గకుండా ఏర్పాటు చేశారని వెల్లడయ్యింది. ఆ నగదును నరసరావుపేట లోని దస్తావేజు రైటర్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అలా పెట్టుబడి గా పెట్టిన సొమ్మును రాబట్టుకునేందుకు నకిలీ రిజిస్ట్రేషన్ ద్వారా సంక్రమించిన భూమిని తాకట్టు పెట్టినట్లు చెబుతున్నారు. ఈ భూమి మీద సుమారు రూ. 7 కోట్ల వరకు తాకట్టు సొమ్మును పొందినట్లు తెలుస్తోంది. ఆ మొత్తాన్ని తలా కొద్దిగా వాటాలు వేసుకొని పంచుకున్నారని ప్రచారం జరుగుతోంది.

నకిలీ రిజిస్ట్రేషన్‌పై ఏసీబీ కన్ను?

గుంటూరు కు సంబంధించిన రూ. 40 కోట్ల భూమి నకిలీ రిజిస్ట్రేషన్ వ్యవహారం లో అధికారుల పాత్రపై ఏసీబీ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నకిలీ రిజిస్ట్రేషన్ కు ఆద్యులైన నరసరావుపేట మాజీ జాయింట్ రిజిస్ట్రార్, కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్, మాచర్లలో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న సీనియర్ అసిస్టెంట్‌ల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించినట్లు తెలిసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా సంబంధిత అధికారులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అసలు ఈ నకిలీ రిజిస్ట్రేషన్ కోసం ఎంత మొత్తం చేతులు మారింది.. ఎవరెవరికి వాటాలు దక్కింది అన్న దానిపై కూడా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో అప్పటి జిల్లా రిజిస్ట్రార్ పాత్రపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

గ్రామాల్లో అభివృద్ధి, ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రాధాన్యం

● వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మురళీకృష్ణ యాదవ్

నూజెండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వినుకొండ మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని రాముడు పాలెం, రాజుపాలెం, తండాల్లో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ నాయకులు గ్రామంలో పర్యటించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నూజెండ్ల సొసైటీ అధ్యక్షుడు బచ్చు అంజిరెడ్డి, డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ లగడపాటి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, టీడీపీ నాయకులు మరిడి సురేష్, ఓబులాపురం వెంకట నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

వినుకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

రామిరెడ్డి పాఠశాలలో డైట్ రిసోర్స్‌పర్సన్స్ పరిశీలన

నాదెండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండంలోని నడికట్టు రామిరెడ్డి ఉన్నత పాఠశాలను డైట్ రిసోర్స్ పర్సన్స్ గురువారం సందర్శించారు. అభ్యాసన సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా రిసోర్స్‌పర్సన్స్ బాల కోటయ్య, విమల కుమారిలు 6వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆ విద్యార్థులు 40శాతంమంది తెలుగు, ఇంగ్లీషు సబ్జక్టుల్లో వెనుకబడి ఉన్నారని, కనీసం అక్షరాలను గుర్తించలేని స్థితిలో ఉన్నారని వివరించారు. ఉపాధ్యాయులు కిందిస్థాయి నుంచే శ్రద్ధపెట్టి వారిని చదివించాలని, లేని పక్షంలో 10వ తరగతిలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులకు తెలియజేశారు.

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌కు సత్కారం

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, నియోజకవర్గ ఐ టీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి గురువారం నియమితులయ్యారు. టీడీపీలో కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని పిల్లి కోటికి లభించిన ఈ అవకాశం నిరూపిస్తోందని ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు అన్నారు. పిల్లి కోటిని వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్కరించారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

● ఏఐసీసీ సెక్రటరి గణేష్‌కుమార్

నరసరావుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి వరక అన్ని రకాల కమిటీలను నియమించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసీసీ సెక్రటరి గణేష్ కుమార్ యాదవ్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని కాంగ్రెస్ పల్నాడు జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గణేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ షర్మిలరెడ్డి నాయకత్వంలో పనిచేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ వైసీపీ హయాంలో రూ.3500 కోట్లు లిక్కర్ స్కామ్ జరిగిందన్నారు. వైసీపీ నాయకులంతా జైళ్లకు వెళ్లే పరిస్థితులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధకార్, చిలకలూరిపేట ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణమూర్తి, వినుకొండ బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

కావమ్మ, సీతమ్మ అమ్మవార్లకు సారె

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం ముగింపు రోజును పురస్కరించుకుని గురువారం పట్టణంలోని బెస్తపాలెంలోని శ్రీసీతారామ సమేత కావమ్మ తల్లి, మారయ్యస్వామి దేవస్థానంలో కావమ్మతల్లి, సీతమ్మతల్లి అమ్మవార్లకు అభిషేకాలు, పసుపు కుంకమలు, సారె పంచారు. భక్తులకు అన్నవితరణ చేశారు. సాపా వీరరాఘవులు, సాపా ఆదినారాయణల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వినియోగదారుల హక్కులపై అవగాహన

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం వారు రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ 2019 వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం ఎంతో పటిష్టమైనదని, వినియోగదారులు నష్టపోయినప్పుడు చాలా తక్కువ ఖర్చుతో వినియోగదారుల కోర్టు ద్వారా నష్టపరిహారం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో 2 రత్నకళ, ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్, డాక్టర్ విద్యాసాగర్, రవి, నాయక్, బేబీ విక్రమ్, గాలయ్య, పొన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం కేబీ రోడ్‌లోని పెట్రోల్ బంకు వద్ద ప్రజలకు వినియోగదారుల హక్కులపై ఫోరం సభ్యులు అవగాహన కల్పించారు.

జొన్నలగడ్డలో డెంగీపై అవగాహన ర్యాలీ

నర్సారావుపేట రూరల్, జూలై 24, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డలోని విలేజ్ క్లినిక్‌ను గురువారం జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీ4 పథకంతో అభివృద్ధికి ఊతం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమం అభివృద్ధికి ఊతమిచ్చే ప్రతిష్టాత్మకమైన పథకం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్ పీ-4 కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ పీ-4 ద్వారా ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల సహకారంతో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, వనమా శివ, అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిదులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణంలో ఐదు బోరింగ్ పంపుల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం శంకుస్థాపన చేశారు. చిలకలూరిపేట అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియం సమీపంలో, చంద్రబాబునాయుడు కాలనీలో రెండు, ఎస్ఆర్‌కేటీ కాలనీలో రెండు బోరింగ్ పంపుల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కార్యక్రమంలో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఈసీ సభ్యుడు ఎం. వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణంలోని పాతూరు శివాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్యేని సాదరంగా ఆహ్వానించి, ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని చందవరం, సాతులూరు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి పుల్లారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో పుల్లారావు మాట్లాడుతూ ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ హామీల్లో భాగంగా పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందించామన్నారు. పింఛన్ పెంపుతోపాటు త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నామని వివరించారు. చంద్రబాబు లాంటి నాయకుడు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వైసీపీ అరాచక పాలనను చూడలేకనే ప్రజలు ఆ పార్టీని ఓడించారన్నారు. మంచి చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెడ్డిపేరంటాలమ్మపేటలో ఏర్పాటుచేసిన సిమెంట్ రోడ్డును పుల్లారావు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ మునుగు శోభారాణి, పార్టీ నాయకులు నార్నె కోటయ్య స్వామి, యన్నం వెంకటరామిరెడ్డి, యన్నం రమణారెడ్డి, జంపని వసంతరావు, కమ్మ పెద శ్రీనివాసరావు, ఐనవోలు రాధా, నందిగం శివయ్య, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



సాతులూరులో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

గుర్రం జాషువాకు ఘన నివాళి



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వినుకొండ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు స్థానిక జాషువా కళాప్రాంగణం వద్ద ఉన్న కాంస్య విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికై అక్షర సమరాన్ని సాగించిన గుర్రం జాషువా స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. జాషువా రచనలతో సమాజాన్ని జాగృతంచేసిన తీరును వివరించారు. సమాజ శ్రేయస్సుకు జాషువా చేసిన కృషిని స్మరించుకుంటూ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో జాషువా సమాఖ్య అధ్యక్షుడు చిలకల జాన్‌సుందరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రోశయ్య, దాసరి కోటేశ్వరరావు, గంధం కోటి, బూదాల సాగర్, దాసయ్య, ప్రసాద్, ఎలియాజర్, గోవిందరాజులు, భాగవతుల రవికుమార్, గంగినేని బాబు, కాంట్రాక్టర్ జానీ, మందా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు గుర్రం జాషువా చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి, న్యాయవాది ఎం.ఎన్.ప్రసాద్, పగడాల వెంకటరామిరెడ్డి, బొట్టు వెంకటరెడ్డి, చెన్నయ్య, గాబ్రియేలుతో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

● గ్రంథాలయంలో పాఠకులతో కలిసి కవి గుర్రం జాషువా చిత్రపటానికి గ్రంథాలయ నిర్వాహకులు బద్రీనాయక్ ఘనంగా నివాళులర్పించారు.

● వినుకొండ: కవి కోకిల గుర్రం జాషువా 54 వర్ధంతి సందర్భంగా భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని గుర్రం జాషువా విగ్రహానికి పల్నాడు జిల్లా కార్యదర్శి కట్టా సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గొడవర్తి సుజాత పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కవలకుంట జాన్ బాబు, నియోజకవర్గం కో కన్వీనర్ న్యాయవాది అప్పారావు, మాజీ జిల్లా కార్యదర్శి మేడమ్ రమేష్, నిరిశెట్టి మహేష్, మూర్తయ్య, వీరయ్య, గరై అనీల్, రాజా పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చందమామ పత్రికకు సహాయ సంపాదకులుగా పనిచేయడం వలన బాలసాహిత్యంపై మక్కువ ఏర్పడిందని, బాల్యం నుంచే కథలు రాసే అలవాటు ఉండేదని బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ గురువారం అన్నారు. స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్) ఆధ్వర్యంలో మహాకవి జాషువ 55వ వర్ధంతి సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంపై జాషువా విసిరిన కవిత్వం దళిత జాతిని జాగృతంచేసి అగ్రపీఠంపై నిలబెటిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డా.పీవీ సుబ్బారావు, తోట రామచంద్ర ప్రసాద్, అజయ్‌బాబు, జి.నారాయణ, జి. యాకోబు, డి.చిట్టిబాబు, డి.బుజ్జిబాబు, చుక్కా విన్సెంట్ పాల్ పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: మహాకవి గుర్రం జాషువా 54వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని గుర్రం జాషువా విగ్రహానికి ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటనాయక్, పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఎమ్మార్పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ అధ్వర్యంలో గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరువయ్య, జీ అనిల్ కుమార్, బండారు సుధాకర్, జీ ప్రశాంతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసరావుపేటలో జాషువా విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయునికి శాకంబరీ అలంకరణ

నరసరావుపేవట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం పాలపాడు రోడ్డులోని ప్రశాంతినగర్‌లో ఉన్న చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి గురువారం శాకంబరీ అలంకరణ జరిగింది. ఆషాఢం చివరి రోజు అమావాస్య కావడంతో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, కదలిఫలం, అరటిపండ్లతో ఈ అలంకరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బీ శ్రీనినవాసరావు, మహిళలు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శాకంబరీ అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

శాకంబరీదేవిగా పార్వతీదేవి..



శాకంబరీదేవి అలంకారంలో పార్వతీదేవి

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24.వ తారీఖు గురువారం ఆషాఢ అమావాస్య సందర్భంగా గురువారం చౌత్రా సెంటర్‌లో ఉన్న గంగాపార్వతి సమేత ఉమామహేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీదేవి అమ్మవారికి ప్రత్యేకంగా శాకంబరీదేవి అమ్మవారిగా అలంకరణ చేశారు. శాకాంబరీదేవి అమ్మవారి సేవలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాశి శరత్‌కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా అమ్మవారి జన్మదిన వేడుకలు

ఈపూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్లలోని గ్రామదేవత శ్రీచౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు నిర్వహించారు. మహిళలు, యువతీ యువకులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారు

జాతీయ ఆక్వాటిక్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి

నరసరావుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రం బెంగుళూరులో ఆగస్టు 4 నుంచి 8 వరకు జరిగే 51వ జాతీయ జూనియర్స్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ -2025 పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి కే శివసాకేత్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ గురువారం తెలిపారు. ఈ నెల 19, 20 తేదీలలో విశాఖపట్నం బీచ్‌రోడ్డు స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. శివసాకేత్‌ను కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, కళాశాల జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ వై మధుసూధనరావు, కోచ్ జీ సురేష్, తదితరులు అభినందించారు.

జూలకంటిని కలిసిన శావల్యాపురం సొసైటీ చైర్మన్

శావల్యాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం సొసైటీ చైర్మన్‌గా నియమితులైన గడిపూడి విశ్వనాథం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని గురువారం కలిశారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని వెల్దుర్తిలోని ఆయన నివాసంలో సొసైటీ చైర్మన్ విశ్వనాథం, కూటమినేతలు కలిశారు. ఈ నెల 28వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ప్రమాణస్వీకార మహోత్సవానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా విశ్వనాథంను ఎమ్మెల్యే జూలకంటి ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ బీజేపీ నాయకులు యార్లగడ్డ లెనిన్‌కుమార్, పల్నాడు జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు గోరింట్ల హనుమంతరావు, టీడీపీ మాజీ మండలాధ్యక్షులు గద్దె వీరమస్తాన్‌రావు పాల్గొన్నారు.



మాచర్ల ఎమ్మెల్యే జూలకంటిని ఆహ్వానిస్తున్న సొసైటీ చైర్మన్ విశ్వనాథం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు తదితరులు

ప్రభుత్వ సహకారం పొందే సంస్థలన్నిటికీ ఆర్టీఐ వర్తిస్తుంది

● జిల్లా సహకార అధికారి నాగరాజు

నరసరావుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సహకారం పొందుతున్న అన్ని సంస్థలకు, అన్ని శాఖల కార్యాలయాలకు సమాచార హక్కు చట్టం వర్తిస్తుందని జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు అన్నారు. గురువారం నరసరావుపేట జిల్లా సహకార బ్యాంక్ మీటింగ్ హాల్‌లో సమాచార హక్కు 2005పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎం.నాగరాజు మాట్లాడుతూ 1964 ఏపీ సీఎస్ చట్టం కింద రిజిస్టర్ చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఆర్టీఐ పరిధిలోకి వస్తాయన్నారు. డివిజనల్ సహకార అధికారి కే తిరుపతయ్య మాట్లాడుతూ సమాచార హక్కు ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం అన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి, డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీస్ సూపరిటెండెంట్ జేపీడీ టాండన్, జిల్లా సహకార కార్యాలయ సూపరిటెండెంట్ కార్తీక్, జీడీసీసీబీ నరసరావుపేట శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

నరసరావుపేట టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రైల్వే స్టేషన్‌లో గురువారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏఎస్ఐ సుభాని, జీఆర్‌పీ సిబ్బంది హనుమంతురావు, నీడ్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ కే ప్రేమానందం, కో ఆర్డినేటర్ రవికుమార్, ఇశ్రాయల్ పాల్గొన్నారు.

జంట హత్యల నిందితుల కోసం వేట

● హైదరాబాద్, బెంగళూరులకు పోలీసుల బృందాలు
● చిలకలూరిపేటలో కారు వదిలి.. గుంటూరు వెళ్లి పరారీ

సంతమాగులూరు, అద్దంకి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండలం పాతమాగులూరు సమీపంలో హత్యకు గురైన తండ్రీకొడుకులు వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. బెంగళూరులో రియల్ వ్యాపారం చేసుకునే తండ్రి తనయులు పల్నాడు జిల్లా నరసరావుపేటలో కోర్టు వాయిదాకు రాగా కిడ్నాప్ చేసి పాతమాగులూరులో బుధవారం నిందితులు హతమార్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిందితులను పట్టుకునేందుకు పోలీసు బృందాలు వేట ప్రారంభించాయి. హత్య చేసిన తర్వాత నిందితులు కారులో చిలకలూరిపేట వద్దకు వెళ్లి అక్కడ వాహనాన్ని వదిలి మరో వాహనంలో గుంటూరు రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అక్కడ నుంచి ఆ సమయంలో స్టేషన్‌లో ఉన్న రైలు ఎక్కి పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఆ సమయంలో హుబ్లీ వైపు ఒక ట్రైన్, హైదరాబాద్ వైపు మరో ట్రైన్ ఉందని, వీటిలో ఏదో ఒక ట్రైన్‌లో నిందితులు వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. నిందితుల కదలికలకు సంబంధించి పోలీసులు కొంత సీసీ పుటేజ్ సేకరించినట్లు సమాచారం. హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలలో నిందితుల కోసం గాలించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు వెళ్లినట్లు బాపట్ల డీఎస్పీ సీతారామాంజనేయులు తెలిపారు. హత్యకు గురైన వీరాస్వామిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డిల మృతదేహాలకు గురువారం నరసరావుపేట వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు అప్పగించారు. మృతదేహాలను బంధువులు బెంగళూరుకు తీసుకువెళ్లారు.



నాభిశిలకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

శావల్యాపురంలో నాభిశిలకు ప్రత్యేక పూజలు

శావల్యాపురం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం అమావాస్య సందర్భంగా మండల కేంద్రమైన శావల్యాపురంలోని నాభిశిలకు మహిళలు గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామపెదకాపు పాలడుగు సత్యనారాయణ, వీరవేణి దంపతుల ఆధ్వర్యంలో మహిళలు బిందెలతో నీటిని తెచ్చి నాభిశిలను శుద్ధిచేశారు. అనంతరం పూజారి రావిపాటి సాయిభరత్‌శర్మ ఆధ్వర్యంలో నాభిశిలను పసుపు కుంకుమలు, పూలమాలలతో అందంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు నాభిశిలవద్ద పొంగలి వండి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో కోర్నె సాంబశివరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రోటరీ ఆరోగ్య కేంద్రానికి విరాళం అందచేస్తున్న రమాదేవి

రోటరీ ఆరోగ్య కేంద్రానికి రూ.25 వేల విరాళం

చిలకలూరిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రోటరీ ఆరోగ్య కేంద్రానికి స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుష్పాల రమాదేవి గురువారం రూ.25వేల విరాళం అందచేశారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మందుల కొనుగోలు నిమిత్తం ఈ విరాళాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు నార్నె జయలక్ష్మీ, క్లబ్ డైరెక్టర్ కరణం విజయ, ఆరోగ్య కేంద్రం డాక్టర్ కందుల రంగారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాదు, కార్యదర్శి బోడి రామసుబ్బారావు, డైరెక్టర్లు దండా లక్ష్మీనారాయణ, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, గోగినేని నాగేశ్వరావు పాల్గొన్నారు.



పాఠశాలకు సైన్స్, మ్యాథ్స్ కిట్లను అందజేస్తున్న సీడ్స్ సంస్థ సభ్యుడు రసూల్

లింగారావుపాలెం పాఠశాలకు సైన్స్ కిట్లు వితరణ

యడ్లపాడు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెం ఎంపీపీ పాఠశాలకు చార్టర్డ్ అకౌంటెంట్ నంబూరు నరసింహారావు ఆధ్వర్యంలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ రూ.25వేల విలువైన సైన్స్, మ్యాథ్స్ కిట్లను అందజేసింది. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడ్స్ సంస్థ సభ్యుడు షేక్ రసూల్ పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. పిల్లలు ఈ కిట్లను ఎలా ఉపయోగించాలి, వాటి ద్వారా సైన్స్, గణితంలోని సంక్లిష్టమైన విషయాలను సులువుగా, ఆచరణాత్మకంగా ఎలా నేర్చుకోవాలో వివరించారు. వీటి వలన విద్యార్థులలో విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా అభ్యసనపై ఆసక్తిని కూడా పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నజీర్, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, గ్రామపెద్దలు తోకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నూజెండ్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం శ్రీ వెంకటేశ్వరస్వామి కమిటీ హైస్కూల్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినుకొండ ప్రభుత్వ హాస్పటల్ కంటి వైద్యులు ఏ గురుస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్ళు ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా దృష్టి సమస్యలను సకాలంలో గుర్తించటం ద్వారా వారి కంటి ఆరోగ్యాన్ని కాపాడటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ కామేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న గురుస్వామి